
# ✱ పుయ్ ... పూసెయ్ ✱

ఈ రోజుల్లో ఏ పత్రిక చూసినా ఏం కన్పిస్తుంది చెప్పండి?
సెక్సా?
ఎబ్బే కాదు.
హింసా?
ఎబ్బెబ్బే... అదీ కాదు. అది హింసేగానీ, మీరనుకునే హింస కాదు.




మరేంటబ్బా?!... చెత్త కథలు? లేకపోతే చెత్త సీరియల్సా?!...
నోనోనో ... అవేవీ మనకి చెత్తనిపించవ్. ఎందుకంటే వాటన్నిటికీ మనం ఏనాడో ఇమ్యూన్ అయిపోయాం.
మరింకేమిటబ్బా?...
మీరు చెప్పుకోలేరు ... నాకు తెల్సు.
పత్రికల్లో కనిపించే ఆ హింసకాని హింస మగాళ్ళకి సంబంధించినది... కొండొకచో ఆడాళ్ళకి కూడా సంబంధించినది.
ఏమై ఉంటుందో మీరు బుర్రలు గోక్కుంటూ, బద్దలు కొట్టుకుంటూ ఆలోచించక్కర్లేదు... నేనే చెప్పేస్తాను.
ఏంటంటే - బ్యూటీ టిప్స్!...

బ్యూటీషియన్స్ ఇచ్చే సలహాలు- అవీ కాకపోతే లేడీస్ శీర్షికల్లో ఆడాళ్ళు టిప్స్ ఇస్తుంటారే ... అవీ...

టిప్స్ అంటే ఇదివరకు బంగాళా దుంపల్ని బాగా ఎండబెట్టి తర్వాత ఉడకబెడ్తే చక్కగా ఉడుకుతాయ్, లేదా కాకర కాయల్ని కుంకుడు రసంలో నానబెట్టి తర్వాత వండితే కూర చేదుగా ఉండదనీ, చేతికి పచ్చిమిరప కాయల రసం రాస్కుని వంట చేస్తే స్టవ్ మీది నుండి వచ్చే సెగకి చేతులు మంటెక్కవనీ... ఇలాంటి టిప్స్ ఇచ్చేవారు.

కానీ ఇప్పుడో? అందరూ బ్యూటీ టిప్స్ తెగ రాస్తున్నారు.

బ్యూటీషియన్స్ ఫీచర్స్‌తో పోటీపడి - ప్రక్కన వాళ్ళకున్న ఫోటోల్లో కాస్త భయంకరంగా ఉన్నది ఎంచుకొని వేయించుకుంటున్నారు కూడా.

సరే... అలాగైతే ఇది మగాళ్ళకి హింస ఎలాగవుతుందీ?...

ఎలాగంటే...

రాత్రి... పది గంటలకి...

"ఏవోయ్... రావాలి ... త్వరగా రావాలి మరి..." మంచం మీదనుండి చంచల్రావ్ హుషారుగా కేకేశాడు.

"వస్తున్నానుండండి"... ప్రక్కగదిలోంచి అతని భార్య సుందరి సమాధానం ఇచ్చింది.

"రావాలి రావాలి ... రావాలంటే రావాలి! త్వరగా రావాలి!!" కేకేశాడు చంచల్రావ్.

"అబ్బబ్బ... ఏమిటండీ ఆ కంగారూ వస్తున్నానంటేనూ..." విసుక్కుంటూ గదిలోకి వచ్చింది సుందరి.

"రా...రా... ఇప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది... ఆ లైటార్పేసి రా పడుకుందాం..."

సుందరి లైటార్పి చంచల్రావ్ ప్రక్కన పడుకుంది.

"ఏంటోయి... శోభనం నాటి పెళ్ళి కూతుర్లా మంచంకి ఆ చివర్న అంచుమీద పడుకున్నావ్?... క్రింద జారిపడిపోయి నడ్డిరక్కొట్టుకోగలవ్... ఇలా దగ్గిరికి రావోయ్... " ప్రేమనంతా గొంతులో పలికిస్తూ అన్నాడు చంచల్రావ్.

"అబ్బబ్బ... ఏంటండీ మీరు మరీనూ..." అంటూ గారాలు పోతూ అతనికి దగ్గరగా జరిగింది సుందరి.

"వామ్మోవ్ ... ఏంటిదీ?..." గట్టిగా అరిచాడు చంచల్రావ్.

"ఏంటండీ బాబూ... నేనింకా మీ మీద .... వెయ్యందే అలా అరిచారు... మీ పాసుగూలా హిహి...హిహిహి..." నవ్వింది సుందరి.
".... వెయ్యడం కాదే బాబూ... ఉన్నట్టుండి మురుగు వాసన వస్తుందేమిటీ?... యాక్... ఆ కిటికీ తలుపులు మూసెయ్... మనింటి ముందు కాలువలోంచి వస్తున్నట్టుంది ఆ వాసన - థూ... " అన్నాడు చంచల్రావ్ - ముక్కు మూసుకుంటూ.
సుందరి కిలకిలా నవ్వింది.
"కాలవ వాసన కాదండీ బాబూ... అది నా మొహం వాసన! కావాలంటే చూడండి."
చంచల్రావ్ భార్య మొహం వాసన చూసి "ఒక్..." అన్నాడు. "ఏంటే బాబూ... నీ మొహం ఇంత కంపు కొట్టేస్తుంది..." అన్నాడు ఆమెకి కాస్త దూరంగా జరుగుతూ.
"నేను మొహానికి పెరుగు, వెన్న రాస్కున్నానండీ... అందుకే అలా వాసన వస్తుంది" అంది సుందరి ముసిముసిగా నవ్వుతూ.
"ఎందుకూ?" తెల్లబోయి చూస్తూ అడిగాడు చంచల్రావ్.
"ఎందుకేంటి... మొహానికి ఇలా పెరుగూ, వెన్న రాస్కుని పది నిముషాల తర్వాత కడిగేస్తే మొహం చాలా మెత్తగా ఉంటుందని ఏదో పత్రికలో చదివానండీ..."
"అయితే ఈ కంపు నేను పది నిముషాల పాటు భరించాలన్న మాట!!..." నిట్టూర్చాడు చంచల్రావ్.
పది నిముషాలు గడిచాయ్. సుందరి మొహం మీది వెన్న, పెరుగు కడుక్కోవడానికి బయటికి వెళ్ళింది.
ఆ వెళ్ళింది వెంటనే రాలేదు. మరో పావుగంట తర్వాత వచ్చింది- వచ్చి పక్కమీద చంచల్రావ్ దగ్గర చేరింది.
"హమ్మయ్య... ఇప్పటికైనా వచ్చావా?... ఏదీ...నీ మొహం ఎంత మెత్తగా అయ్యిందో చూద్దాం..." అంటూ సుందరి బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాడు.
"అబ్బ సుందూ... నిన్ను ముద్దు పెట్టుకోవడం నిజంగా ఎంతటి తియ్యని అనుభవమో!! ..." అన్నాడు.
సుందరి కిలకిలా నవ్వింది.
సుందరి రెండో బుగ్గ మీద కూడా ముద్దు పెట్టుకున్నాడు.
"హబ్బ!...ఏం తీపి!!...ఏం తీపి!!!".... అన్నాడు లొట్టలు వేస్తూ.

సుందరి మళ్ళీ కిలకిలా నవ్వింది.
"మీరు వొట్టి అమాయకపు పక్షండీ... హిహి" అంది చంచల్రావ్ బుగ్గమీద పొడుస్తూ.
అప్పుడు చంచల్రావ్‌కి కాస్త అనుమానం వచ్చి సుందరి బుగ్గని కాస్త నాకాడు.
సుందరి బుగ్గ తియ్యగా ఉంది.
అయితే అది ముద్దులోని తియ్యదనం కాదన్నమాట!... సుందరి బుగ్గే తియ్యగా ఉందన్నమాట!!
"ఏంటె నీ బుగ్గలు తియ్యగా ఉన్నాయ్?!"
ఆశ్చర్యంగా అడిగాడు.
"మొహానికి చెంచాడు తేనె, రెండు చుక్కలు గ్లిజరిన్, నాలుగు చుక్కలు బేగాన్ స్ప్రే కలిపిన మిశ్రమం బాగా పట్టించి అనక కడిగేస్తే మొహం కొత్త స్టీలు పళ్ళెంలా తళతళలాడిపోతుందండీ... ఈ విషయం ఈ వారం పత్రికలో ఇందాకే చదివాను..." సంబరంగా చెప్పింది సుందరి.
"తేనె, గ్లిజరిన్ బాగానే ఉందిగానీ ఆ బేగాన్ స్ప్రే ఎందుకే బాబు?"
"ఎందుకేంటండీ... చర్మ రంధ్రాల్లో దాగివున్న సూక్ష్మ క్రిములు ఆ బేగాన్ స్ప్రే వల్ల చస్తాయట!! ..."
అప్పుడు గుర్తుకొచ్చింది చంచల్రావ్‌కి తను సుందరి బుగ్గలు నాకాడని!
"బాబోయ్..." అని అరుచుకుంటూ మంచం దూకి బాత్రూంలోకి వెళ్ళి నాలుక పీక్కుంటూ నోరు కడుక్కున్నాడు.
ఓ పది నిముషాల తర్వాత "ఉండండి ... ఇప్పుడే తేనె కడుక్కుని వస్తాను..." అంటూ మంచంమీంచి లేచింది సుందరి.
"తేనె కాదు- బేగాన్ స్ప్రే అని అను." పళ్ళు కొరుకుతూ అన్నాడు చంచల్రావ్.
బాత్రూంకి వెళ్ళిన సుందరి అయిదు నిముషాలైనా రాలేదు... పది నిముషాలైనా రాలేదు... పావుగంటైనా రాలేదు...
ఏంటి!... బేగాన్ స్ప్రే కడుక్కోవటానికి ఇంతసేపా! కొంపతీసి అద్దంలో తళతళలాడే తన మొహాన్ని చూసుకొని మూర్ఛపోలేదు కదా?...
చంచల్రావ్ అలా ఆలోచిస్తుండగా గది తలుపులు కిర్రుమని శబ్దం చేశాయి. అతను గుమ్మంవైపు చూశాడు.
తలుపులు మెల్లగా తెరుచుకొంటూ ఒక భయంకరమైన ఆకారం లోపలికి వచ్చింది.

"బాబోయ్...దెయ్యం...భూతం...పిశాచి..." అంటూ కేకలు పెట్టాడు గడగడా వణికిపోతూ చంచల్రావ్.
"ఛస్ నోర్మూస్కోండి... ఎవరైనా వింటే నవ్విపోతారు..." అంది ఆకారం. అది సుందరి గొంతు! అనుమానంగా దడదడలాడ్తున్న గుండెల్తో ఆ ఆకారాన్ని చూశాడు చంచల్రావ్.
"నేనేనండీ బాబూ... ఫేషియల్ చేస్కున్నా... చూశారా... నేనే స్వయంగా చేస్కుని మీకు డబ్బులు మిగిల్చాను? ... ఇదే ఏ బ్యూటీ పార్లర్లోనో చేయించుకుంటే డెబ్బయి అయిదు తీస్కుంటారు తెల్సా! ఇలా నెలకోసారి చేస్తే మొహం చాలా కాంతివంతంగా ఉంటుందని మరో వార పత్రికలో చదివాను..." అంది సుందరి సంబరంగా.
చంచల్రావ్ తలకాయ పట్టుకున్నాడు.
పావుగంట తర్వాత ఫేస్ మాస్క్ కడుక్కుని వచ్చింది.
"ఇప్పటికైనా పడుకుందామా... పదకొండు దాటిపోయింది?"అడిగాడు చంచల్రావ్.
"ఓ... అలాగే..." అంటూ లైటార్పి అతని ప్రక్కన పడుకుంది.
చంచల్రావ్ సుందరిని దగ్గరికి తీస్కోవాలని అనుకునేంతలో వింత వింత శబ్దాలు వినిపించాయి అతనికి.
"కరూమ్...కటక్...పచక్ పచక్ పచక్...కస కస...కస బిస..."
"ఏంటా శబ్దాలు?" భయంగా అడిగాడు చంచల్రావ్.
"నేనేనండీ ... కారెట్లూ, బెండకాయలూ, దొండకాయలూ నములుతున్నా... కరూమ్...కచక్... పచక్... " అంటూ సమాధానం ఇచ్చింది సుందరి.
"ఎందుకూ!?– ఇందాకేగా సుష్టుగా భోజనం చేశావ్? అప్పుడే ఆకలేస్తుందా?"
సుందరి కిలకిలా నవ్వింది.
"ఓసి మీ అమాయకత్వం కూలా... ఇది ఆకలికి కాదండీ... ఇలా పచ్చి కూరగాయలు తింటే అసలు వృద్ధాప్యం రాదట... ఎప్పుడూ యవ్వనంతో ఉంటారట" అంది.
"అర్ధరాత్రి దాకా అవీ ఇవీ పూస్కుని కచక్ పచక్మని తినుకుంటూ కూర్చుని అనక ఊరికినే పడుకోవడానికి ఎందుకొచ్చిన యవ్వనం?..." విసుక్కుంటూ అటుతిరిగి పడుకున్నాడు చంచల్రావ్.
అన్ని రకాల పత్రికల్లో చదివినవన్నీ ఆచరిచ్చేస్తుంది సుందరి. మొహానికి పెరుగు రాస్తుంది. మెడకి నెయ్యి రాస్తుంది. పాదాలకి మీగడ

రాస్తుంది. టమోటా రసంతో మొహం కడుగుతుంది. ఇంకా చాలా చాలా చేస్తుంది. అంతేకాదు ... బజార్లోంచి ఏవేవో కాస్ట్లీ క్రీములన్నీ కొనుక్కొచ్చి మొహానికీ, ఒంటికీ పూసేస్కుంటుంది... చంచల్రావ్ కి గుండు కొట్టేస్తుంది.

అన్నీ చేసి మొహానికి గుప్పెడు పౌడర్ పూస్కుని "చూశారా అవన్నీ చెయ్యడం వల్ల నేనెంత తెల్లగా అయ్యానో?" అంటూ కిలకిలా నవ్వుతుంది.

చివరికి విసుగెత్తిన చంచల్రావ్ పత్రికలన్నీ కొనడం మానేశాడు.

* * *